బీఈ రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సుల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ ఎనిమిదో సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వివిధ కోర్సులకు సంబంధించి పరీక్షా ఫీజులను స్వీకరిస్తున్నట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్(హెచ్ఐ) మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 8 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని పేర్కొన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో 9 వరకు చెల్లించవచ్చన్నారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజులను వచ్చే నెల 8 వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని తెలిపారు. రూ. 300 అపరాధ రుసుముతో 13 వరకు చెల్లించవచ్చని వివరించారు. పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి.. ముగ్గురు అరెస్ట్

మాదన్నపేట, జూలై 30: వ్యక్తిపై దాడికి పాల్పడి, కారు అద్దాలు పగలకొట్టిన ముగ్గురిని అరెస్ట్ చేసిన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రియాన్ మాదన్నపేట మహ్మదీయ మజీద్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. సోమవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు రియాన్ ఇంటి పరిసరాల్లో మద్యం సేవిస్తుండటంతో అభ్యతరం వ్యక్తం చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన మందుబాబులు రియాన్‌పై దాడి చేసి.. పక్కనే ఉన్న కారు అద్దాలు పగులకొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చరణ్, ఆకాశ్, సిద్ధును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

హామీలు అమలు చేయాలి

- ఆశా వర్కర్ల అక్రమ అరెస్టును ఖండించాలి
- సీఐటీయూ జిల్లా నాయకుడు ఏర్పుల నరసింహ

హయత్‌నగర్‌లో అరెస్టయిన ఆశా వర్కర్లు

హయత్‌నగర్, జూలై 30: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన వాగ్దానాలను ముందుగా అమలు చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకుడు ఏర్పుల నరసింహ డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఆశా వర్కర్లను హయత్‌నగర్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు రిక్రూట్ చేసుకోవడానికి నిర్వహించే పరీక్షలు రద్దు చేయాలని, తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆశాలకు రూ.18వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపడితే ఆశా వర్కర్లను ముందస్తుగా ప్రభుత్వమే అరెస్టు చేయించడం సరైందికాదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం దిగొచ్చి మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని, లేనియెడలా సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టు చేసిన వారిలో ఆశా వర్కర్లు రమ్య, లావణ్య, సుందరి, రాజేశ్వరి, సంతోష, వనజ, జ్యోతి, అనిత, తదితరులు ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

కందుకూరు: హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ తెలిపారు. పంచాయతీ కార్మికులు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా ముందుస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ధర్నా నిర్వహించిన అనంతరం శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తా రోకో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంతో కాలంగా పంచాయతీ కార్యాలయాల్లో వెట్టి చాకిరి చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన అనంతరం మాటతప్పడం సమజసం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కారోబర్ల సంఘం అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, శ్రీపాలు, రాములమ్మ, అండాలు, లక్ష్మమ్మ, చంద్రమ్మ, భాగ్యలక్ష్మి, మమత, నర్సమ్మ, సోచమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, చిత్రంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

జీఐఎస్ సర్వేకు ప్రజలు సహకరించాలి

హయత్‌నగర్, జూలై 30: స్మార్ట్ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ మహానగర పాలకసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబోయే జీఐఎస్ సర్వేకు ప్రజలు సహకరించాలని జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య కోరారు. మంగళవారం హయత్‌నగర్ వార్డు కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి డీసీ యాదయ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఐఎస్ సర్వేకు ప్రజలందరూ సహకరించాలన్నారు. దీంతో ప్రజలందరీ వివరాలను, జీహెచ్ఎంసీ రూపొందించిన యాప్‌లో పొందుపరుస్తారని వివరించారు. సర్వే చేస్తున్న సమయంలో జీహెచ్ఎంసీ సిబ్బందికి తగిన సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మహేందర్, పీఓ బలరాం, బిల్ కలెక్టర్లు, జీహెచ్ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివారు కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి

మన్సూరాబాద్, జూలై 30: శివారు కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. హయత్‌నగర్ పరిధి శివంహిల్స్ కాలనీ నుంచి శ్రీదుర్గానగర్, ప్రగతినగర్, ప్రియదర్శినికాలనీ మీదుగా కుంట్లూరు రోడ్డు వరకు రూ.21.30 లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా ఎగువ కాలనీల్లో ఉన్న రోడ్ల సమస్య ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందన్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంగా కారణంగా ఆగిపోయిన రోడ్డు పనులకు రీటెండరింగ్ చేయించి సమస్యకు పరిష్కారం చూపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు కృష్ణగుప్తా, నర్సింహారెడ్డి, శ్రావణ్‌కుమార్, ఆనంద్, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాధాకృష్ణ, నరేశ్‌రెడ్డి, ఆనంద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

రేపు కందుకూరుకు సీఎం రేవంత్‌రెడ్డి

ఏర్పాట్లు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, జూలై 30: రేపు కందుకూరు మండలానికి సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీలు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఆగస్టు 1న మీర్‌ఖాన్‌పేట్ గ్రామ సమీపంలోని అమెజాన్ డాటా సెంటర్ దగ్గర రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే స్కిల్‌డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని.. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. సీఎంతో పాటు మంత్రులు, అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, పార్టీ మాజీ అధ్యక్షుడు కృష్ణా నాయక్, మండల కో-ఆర్డినేటర్ ఎండీ అప్జల్ బేగ్, ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, అందుగుల సత్యనారాయణ, వీరారెడ్డి, ప్రశాంత్‌కుమార్, సొడపు వెంకటేశ్‌గౌడ్, రాకేశ్‌గౌడ్, రగుమయ, బాబు, కృష్ణ, జగన్ పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి తదితరులు

దేశ వ్యాప్తంగా నేల కలుషితం..

- పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిది..
- సేంద్రియ వ్యవసాయంపై అవగాహన అవసరం
- ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.రఘురామిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 30: దేశ వ్యాప్తంగా నేల కల్మశం అవుతుందని, అనేక తప్పుడు కార్యక్రమాల వల్ల నేల, పర్యావరణం కలుషితం అవుతుందని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, డా.రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం విస్తరణ విభాగం ఆడిటోరియంలో దక్షిణ భారత్‌లోని శాస్త్రవేత్తలకు జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ప్రాణికి, ప్రధానంగా మానవుని మనుగడకు నేల ఎంతో అవసరమని, మనం ఎంత కాపాడుకుంటే అంత కంటే మరింత మంచి ఫలితాలిస్తుందని తెలిపారు. కలుషితమైన గాలి, నీరు, ప్లాస్టిక్ అతి ఎక్కువగా నేలను కలుషితం చేస్తుందని గుర్తుచేశారు. సహజ వనరులను విచక్షణా రహితంగా వాడకాన్ని తగ్గించాలని అన్నారు. భావి తరాలకు కాలుష్య రహిత వనరులను అంది స్తూ , ఆహార ధాన్యాల ఉత్పత్తిలో నెలకొన్న స్తబ్ధతను అధిగమించాలన్నారు. అనంతరం దక్షిణ తెలంగాణ మండల సహ పరిశోధనా సంచాలకులు డా. మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న జనాభా, తగ్గుతున్న అటవీ , చెరువు కుంటల సంఖ్య, పొల్యూషన్ తదితరాల వల్ల నేల సారం దెబ్బతింటుందని.. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని గుర్తు చేశారు. మన పరిశోధనలు వేగవంతం చేస్తూ , సేంద్రియ వ్యవసాయంపై గ్రామీణ ప్రాంత రైతులకు , పట్టణ ప్రజలకు ప్లాస్టిక్ భూతం వల్ల కలిగే నష్టంపై అవగాహన కల్పించాలన్నారు. దీర్ఘకాలిక ఎరువుల విధానం, జీవన ఎరువుల సూక్ష్మ పోషకాలు , భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల సిఫారస్ , వివిధ అంశాలపై పరిశోధనలు సాగిస్తున్న దక్షిణ రాష్ట్రాలు , రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు చత్తీష్‌గఢ్, అఖిల భారత సమన్వయ పరిశోధన, ప్రాజెక్టు పరిశోధన ప్రగతిని సమీక్షించడానికి ఉద్దేశించింది ఈ సదస్సు అని గుర్తు చేశారు. ఈ సందస్సులో జమ్ములోని షేర్ - ఇ- కాశ్మీర్ (యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ టెక్నాలజీ) మాజీ ఉపకులపతి డా.శర్మ బృందం, భోపాల్ బృందం, భోపాల్‌లోని వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సదస్సు మరో రెండు రోజులు కొనసాగనుంది.

బీజేపీ నాయకుడు పసుపుల హరిబాబు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న వీఎం హోం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బీజేపీ నాయకుడు హరిబాబు మృతి

ఎల్బీనగర్, జూలై 30: బీజేపీ సీనియర్ నాయకుడు, దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు మున్సిపల్ కాలనీకి చెందిన పసుపుల హరిబాబు అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. వీఎం హోం వాకర్స్ అసోసియేషన్ సభ్యుడైన హరిబాబు మరణం పట్ల వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు భౌతిక కాయానికి నివాళులర్పించారు. వీఎం హోం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బేర బాలకిషన్, ప్రతినిధులు జక్కల శ్రీశైలం యాదవ్, ఐలయ్య యాదవ్, బబ్బురి ఆనంద్‌కుమార్ గౌడ్, దుబ్బాక శశిధర్‌రెడ్డి, సుభాష్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొని హరిబాబు కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదే విధంగా చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వినోద్‌యాదవ్, జిల్లా నాయకుడు రుద్రారపు శంకర్, సీనియర్ నాయకుడు కందికంటి ఖన్నా గౌడ్, దండు ప్రదీప్‌కుమార్, సత్యనారాయణ తదితరులు హరిబాబు మృదదేహం వద్ద నివాళులర్పించారు. చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా హరిబాబు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మాజీ కౌన్సిలర్ త్రివేది, పవన్‌కుమార్‌లతో పాటు పలువురు బస్తీ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

లయన్స్ క్లబ్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరులో విద్యార్థులకు, పేదలకు ఆహార పదార్థాలను అందజేస్తున్న జిల్లా మొదటి వైస్ గవర్నర్ డాక్టర్ పి.మహేంద్రకుమార్‌రెడ్డి

కందుకూరు, జూలై 30: లయన్స్ క్లబ్ సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మొదటి వైస్ గవర్నర్ డాక్టర్ పి.మహేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. కందుకూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా పేదలకు, విద్యార్థులకు ఆహార పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం లయన్స్ క్లబ్ నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందిచడానికి కృషి చేసున్నట్లు చెప్పారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ మట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కార్యదర్శి తాళ్ల అంజయ్య, మండల అధ్యక్షుడు సురుసాని విట్టల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తా, మాజీ ఉప సర్పంచ్ గుండ్ర సుదాకర్‌రెడ్డి, రాంరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

దాతునగర్ ప్రభుత్వ పాఠశాల వెనుక భాగంలో పేరుకుపోయిన చెత్త, మురుగు నీరు

దాతునగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనకాల రోడ్లపై మురుగు నీరు పారుతున్న దృశ్యం

- రోడ్లపై పారుతున్న మురుగు
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- గతుకుల రోడ్లతో తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

బడంగ్‌పేట, జూలై 30: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దాతునగర్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుకాల మురుగు నీరు రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. పక్కనే ఉన్న పాఠశాల భవనం వెనుక భాగంలో చెత్త పేరుకుపోయి.. పాఠశాల ప్రహరీని ఆనుకొని మురుగు ప్రవహిస్తుండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల బారిన పడుతున్నామని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కొత్తగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి శివశంకర్‌ను సన్మానిస్తున్న మల్లారెడ్డి

పంచాయతీ కార్యదర్శుల సేవలు వెలకట్టలేనివి

కందుకూరు, జూలై 30: పంచాయతీ కార్యదర్శుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ కార్యదర్శి సాద మల్లారెడ్డి తెలిపారు. కొత్తగూడ పంచాయతీ కార్యదర్శి శివశంకర్ బదిలీ కావడంతో ఆయనను మంగళవారం పంచాయతీ కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తాళ్ల పద్మమ్మ, మాజీ వార్డు సభ్యులు బొక్క హన్మంత్‌రెడ్డి, మర్రి శేఖర్‌రెడ్డి, వెంకటాచారి, మహేందర్, పసులకాడి చెన్నకృష్ణ, బొక్క రాచంద్రారెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని బాలింత మృతి

హయత్‌నగర్, జూలై 30: ఉరేసుకొని బాలింత మృతిచెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా, దేవరకొండ, చింతపల్లి మండలం, దేన్యా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గాసిరాం తండాకు చెందిన రమావత్ శివ, భార్య రమావత్ సుజాత, అలియాస్ దివ్య(21), కుటుంబ సభ్యులతో కలిసి హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారాకాలనీలో నివాసముంటున్నారు. 2023లో దివ్యకు, శివతో వివాహం జరిగింది. వీరికి ఆరు నెలల క్రితం పాప జన్మించింది. మంగళవారం సాయంత్రం దివ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

దోస్త్ స్పెషల్ అడ్మిషన్లకు ఆహ్వానం

బడంగ్‌పేట, జూలై 30: బడంగ్‌పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు తీసుకోవడం జరుగుతుందని ప్రిన్సిపాల్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యా మండలి, కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎట్ ఎడ్యూకేషన్ వారి ఆదేశాల మేరకు ఆగస్టు 2న అడ్మిషన్లు గడువు ముగుస్తుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దోస్తు 12818 రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిషన్లు పొందగలరన్నారు. కళాశాలలో బీఏ, బీకాం, కంప్యూటర్ ఆప్లికేషన్ బీఎస్సీ, సైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్ కోర్సులు ఉన్నాయన్నారు. అడ్మిషన్లు కావాలనుకునే వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

రాఘవేంద్రస్వామి ఆలయంలో కల్యాణ మండపం

- ప్రారంభించిన మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రస్వామి


పాల్గొన్న సుబుదేంద్ర తీర్థ శ్రీపాదుల స్వామీజీ, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 30: సచివాలయనగర్ కాలనీలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో నూతన కల్యాణమండపాన్ని నిర్మించారు. ఆ మండపాన్ని మంగళవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదుల స్వామీజీ ప్రారంభించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, భగవంతుడి ఆశీస్సులు అందరికీ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మఠం గురువు లక్ష్మీనారాయణ, యాదగిరి రావు, దామోదర్‌రెడ్డి, లీలానాథ్, జైపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సంగమేశ్వర్, పవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా.. పనులు చేపట్టరా.?

జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు, చిత్రంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, జూలై 30: హయత్‌నగర్ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరై చాలా కాలమైనా ఇప్పటికీ డ్రైనేజీ పైపులైన్ పనులు చేపట్టరా.? అని జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌ను వెంకటేశ్వర కాలనీవాసులు నిలదీశారు. మంగళవారం జలమండలి జనరల్ మేనేజర్‌ను వెంకటేశ్వర కాలనీవాసులు హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ పనుల కోసం నిధులు మంజూరైనా ఇప్పటి వరకు నిర్మాణ పనులు చేపట్టకపోవడం ఏమిటని అధికారుల తీరుపై మండిపడ్డారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరంతా ఖాళీ ప్రదేశాల్లో చేరి దుర్వాసనతో పాటు దోమల బెడద అధికమైందని తెలిపారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు వెంకటేశ్వర కాలనీలో డ్రైనేజీ పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఆయన వెంట కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, శేషు, శేఖర్‌రెడ్డి, బ్రహ్మచారి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.